# వెంటపడిన వ్యక్తి

హాలు నుంచి ఇవతలకి వచ్చి టైము చూసుకున్నాడు చక్రవర్తి. పన్నెండున్నర అయింది. ఆ సినిమా చాలా రోజుల నుంచి ఆడుతుండడంచేత జనం అట్టే లేరు. అది నవంబరు మాసం కావడంవల్ల కొద్దిగా చలిగా ఉంది. నెమ్మదిగా బయలుదేరి జి. టి. రోడ్డుమీదికి వచ్చి, న్యూ సినిమా వద్ద కుడిచేతివైపు తిరిగాడు. స్టేషన్‌వద్ద ఉన్న టన్నెల్ దాటి ధాక్కా రోడ్డుమీదికి వచ్చాడు. హాస్టల్ చేరుకోడానికి ఇంకా ఒకమైలు నడవాలి. ఎక్కడా మనుష్య సంచారం లేదు.

కొంత దూరం వెళ్లిన తరువాత ఎవరో వెనకాల వస్తున్నట్టు అనుమానంవేసి వెనక్కి తిరిగి చూశాడు. ఎవ్వరూ కనిపించలేదు. కొంత దూరం వెళ్లిన తరువాత ఎందుకో మళ్లీ అనుమానం వచ్చింది. మళ్లీ తిరిగి చూశాడు. ఈ సారి కూడా ఎవ్వరూ కనిపించలేదు. తన అనుమానానికి నవ్వుకున్నాడు. ఇలా ఎవరో

రెండవ బహుమతి రూ. 25

## టి.వి. సత్యనారాయణ

(రెండవ సంవత్సరం - మైనింగ్, అసన్‌సోల్ పాలిటెక్నిక్, అసన్‌సోల్, బర్ద్వాన్‌జిల్లా, పశ్చిమ బెంగాల్)

వెనకాల వస్తున్నట్లు మాటి మాటికీ తనకి అనుమానం రావడానికి కారణం ఆ రోడ్డు నిర్మానుష్యంగా ఉండటమే అని అనుకుని, ఇటువంటి అనుమానాలకి తావు ఇవ్వకుండా ఉండడానికని రైల్వే కాలనీలో ఉండే అమ్మాయిని గురించి ఆలోచించడం మొదలుపెట్టాడు.

కాని అతని ఆలోచనలు అట్టేసేపు సాగలేదు. ఎవరో తనని వెంటాడుతున్నారన్న అనుమానం అతన్ని పీడిస్తూనే ఉంది. ఉండబట్టలేక వెనక్కి తిరిగాడు ఈ సారి నిజంగానే ఎవరో వస్తున్నారు. ఎందుకో అతనికి కొంచెం భయం వేసింది. మొన్న తన సీనియర్ స్టూడెంట్ కేశవ్‌దాస్ చెప్పాడు - సెకండ్‌షో చూసి ఈ రోడ్డు మీద రావడం కొంచెం ప్రమాదకరమని.

అన్నిసార్లు వెనక్కి తిరిగిచూస్తే తను భయపడుతున్నట్లు వాడికి తెలిసి పోతుందని మరి వెనక్కి తిరిగి చూడకుండా కొద్దిగా వేగం హెచ్చించి నడవడం మొదలు పెట్టాడు.

ఇంతలో అతని బుర్ర కూడా చురుకుగా పని చెయ్యసాగింది.





ఇప్పుడు తనేం చెయ్యాలి? మొదట అసలు వాడు తనకోసమే వస్తున్నాడో, లేక ఏదో తన దారిని తాను పోతున్నాడో తెలుసుకోవాలి. అదేదో సినిమాలో చూసినది గుర్తుకి వచ్చింది. హీరో వెనకాల ఎవరో వస్తూంటే, అతను తన వెంట బడ్డాడా లేదా అనేది తెలుసుకోడానికని ఆ హీరో ఆగి సిగరెట్ వెలిగిస్తాడు. అప్పుడు ఆ వ్యక్తి కూడా ఆగి ఎటో చూస్తున్నట్లు నటిస్తాడు. దాన్నిబట్టి అతను తన వెనకాల పడ్డట్టు హీరో గ్రహిస్తాడు. అలా చెయ్యవచ్చు కాని, తను సిగరెట్ కాల్చడు. పోనీ వంగి ఏదో వెతుకుతున్నట్లు నటిస్తే ...?

అతను ఆగి, వెనకాల వస్తున్న వ్యక్తిని ఒకకంట కనిపెడుతూనే ఏదో వెతుకుతున్నట్టు నటించసాగాడు. ఆ వ్యక్తి అతన్ని సమీపించి, అతన్నిదాటి ముందుకి వెళ్లిపోయాడు. అలా తననిదాటి వెడుతున్నప్పుడు ఆ వ్యక్తి టైరుచెప్పులు తొడుక్కుని ఉన్నట్టు గమనించాడు చక్రవర్తి. తనని దాటి వెళ్లిన ఆ వ్యక్తి కొద్దిగా ముందుకి వెళ్లి, ఎడమ పక్కనున్న గేటు తెరుచుకొని లోపలికి వెళ్లిపోయాడు.

అది చూడగానే అంతవరకు భయపడుతున్న చక్రవర్తికి ఎక్కడలేని నవ్వు వచ్చింది. ఇంతవరకు తను ఏమేమిటో అనుకున్నాడు కాని ఆ వ్యక్తికూడా తనలాగే ఏదో సినిమాచూసి వస్తున్నట్టున్నాడు. అనవసరంగా ఎంత భయపడ్డాడు తను?

హుషారుగా అడుగులు వెయ్యడం మొదలుపెట్టాడు చక్రవర్తి. ఇంతలో అతనికి ఒక ఆలోచన వచ్చింది. హాస్టల్‌కి వెళ్లిన తరువాత, అందరితో ఎవరో తనని అటకాయించారని, వాడికి నాలుగు తగల్నిచ్చి వచ్చానని చెప్పితే?

కాని చెప్పేముందు బాగా ప్లాన్‌వేసి చెప్పాలి. తను సెవ్రాలె మోడ్ దాటి వస్తుంటే పోస్టాఫీసు దగ్గర ఇందాకటినుండి వెంటబడ్డతను గబగబా తనవద్దకి వచ్చి కత్తి చూపించాడు. ఆ పళంగా తను తన గుప్పెట్లోఉన్న మట్టిని అతని కళ్లలోకి - వైగివే - గుప్పెట్లోకి మట్టి ఎలా వచ్చింది? అతని వాలకం చూసి అనుమానంవేసి తను మొదటే కొంతమట్టి చేతిలోకి తీసుకుని రెడీగా ఉన్నట్టు చెబితే సరి. కాని నమ్మశక్యంగాలేదు. అసలు పోస్టాఫీసు దగ్గర కాకుండా "టిప్‌టాప్" దగ్గరఉన్న వంతెన దగ్గర అంటే ఇంకా బాగుంటుందేమో ...

ఆలోచిస్తూ నడుస్తున్న చక్రవర్తి నోటిని ఒక బలమైన చెయ్యి మూసింది. అతను పెనుగులాడాడు. కాని, ఇంతలో ఏదో గట్టిగా తలమీద తగలడంవల్ల కళ్లు బైర్లు కమ్మాయి. స్పృహతప్పి నేలమీద పడిపోతున్న అతనికి టైరుచెప్పులు తొడుక్కుని ఉన్న రెండు కాళ్లు కనిపించాయి. ***